
# ఘనంగా ఎమ్మెల్యే గంగుల పుట్టినరోజు వేడుకలు

**రక్తదానం చేసిన బీఆర్ఎస్ నాయకులు**



కొత్తపల్లి : మొక్క నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

వీణవంక, మే 8 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పుట్టిన రోజును పురస్కరించుకొని శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి అప్పని హరీశ్ వర్మ మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను కరీంనగర్‌లోని వారి నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కరీంనగర్ రూరల్, మే 8 : మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పుట్టినరోజు సందర్భంగా ఆపరేషన్ సింధూర్ సైనిక సహాయార్థం రక్తదానం చేశారు. కరీంనగర్‌లో ఆరోగ్య రక్త సేకరణ కేంద్రంలో మండలంలోని దుబ్బపల్లికి చెందిన మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బతి రంగారెడ్డి, చెర్లభూత్కూర్ గ్రామ అధ్యక్షుడు కూర శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆరోగ్య రక్త నిధి సెంటర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, కరీంనగర్ మండల నాయకులు ఆరోగ్య బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన బీఆర్ఎస్ మండల కార్యకర్తలను పార్టీ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెర్లభూత్కూర్, దుబ్బపల్లి, చామనపల్లి గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, గంగుల కమలాకర్ అభిమానులు పాల్గొన్నారు.



కరీంనగర్ రూరల్: రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తపల్లి, మే 8 : చింతకుంటలోని రాజీవ్ గృహకల్ప సైట్‌లో మొక్కలు నాటారు. అలాగే జీకే యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మండలానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు దేశ సైనికుల సహాయార్థం రక్తదానం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులాల సమన్వయకర్తకు డాక్టరేట్



సురేశ్

కలెక్టరేట్, మే 8 : కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మైనార్టీ గురుకులాల సొసైటీ రీజినల్ కోఆర్డినేటర్ కనపర్తి సురేశ్‌కు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా వర్సిటీ నుంచి ఆయన ఎంపిక కాగా, అమితవ్ ఘోష్ ఎంపిక చేసిన నవలలో డీకాలనైజేషన్ అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డా.మెలిస్సా హెలెన్ పర్యవేక్షణలో ఆంగ్ల సాహిత్యంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. జిల్లాలోని చొప్పదండి పట్టణానికి చెందిన సురేశ్ అక్కడే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి వరకు చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎస్‌జీఎం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆటోమొబైల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేశారు. పలు వర్సిటీల నుంచి మూడు పీజీలు పూర్తి చేసి, 2013లో ఇంగ్లిష్ లిటరేచర్‌లో ఏపీసెట్‌లో, 2015లో సైకాలజీలో టీఎస్ సెట్‌లో అర్హత సాధించి, రెండు రాష్ట్రాల్లో టాపర్‌గా నిలిచారు. ఆయన ఇప్పటివరకు 18 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా, 2021లో టీఎస్‌పీఎస్సీ గురుకుల ప్రిన్సిపాళ్ల ఫలితాల్లో రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచి కరీంనగర్ పట్టణంలోని టీఎంఆర్ఎస్ బాలుర 2 గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. 2023 ఆగస్టు నుంచి మైనార్టీ గురుకులాల సొసైటీ రీజినల్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టి, విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 99.8 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపారు. కనపర్తి సురేశ్‌ను గురుకులాల ప్రిన్సిపాళ్లు, మిత్రులతో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు.

## బ్యాంకు లింకేజీ రుణాల మంజూరులో జిల్లా మొదటి స్థానం

కలెక్టరేట్, మే 8 : 2024–25 ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీలో జిల్లాకు మొదటి స్థానం లభించింది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా సంబంధితాధికారులు అవార్డు అందుకున్నారు. అనంతరం కలెక్టర్‌ను కలవగా, ఆమె అభినందించారు. గతేడాది రూ.771కోట్ల లక్ష్యానికి గాను రూ.787కోట్ల రుణాలు స్వయం సహాయక సంఘాలకు వివిధ బ్యాంకుల నుంచి ఇప్పించి, 102 శాతం ప్రగతి సాధించగా, ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ డిఆర్‌డిఏ సిబ్బందికి సూచించారు.

## పలు గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర

చిగురుమామిడి, మే 8: మండలంలోని ఓగులాపూర్, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, నవాబుపేట గ్రామాల్లో హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వా లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. నేటి యువత మత్తుకు బానిస కాకుండా ఉద్యోగ అవకాశాల్లో రాణించాలన్నారు. డ్రగ్స్ ద్వారా వచ్చే అనర్థాలను జేఏసీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య గ్రామాలలో వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఖాజా మోహినుద్దీన్, జేఏసీ నాయకులు ఉప్పుల కుమార్, గాండ్ల పద్మ, తాళ్లపల్లి జగన్, తాళ్లపల్లి ప్రభాకర్, ఏపీఎం సంపత్, మాజీ జడ్పీటీసీ అందే స్వామి, ఐకెపీ (సెర్ప్) సీసీ దుబ్బాక వెంకటేశ్వర్లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కళాకారులకు కళాత్మక వస్త్రాలు అందజేత

తిమ్మాపూర్ రూరల్, మే 8 :మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన చిరుతాల కళాకారులకు గురువారం కళాత్మక వస్త్రాలను బీఆర్ఎస్ నాయకుడు పొన్నం అనిల్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన 15 మంది చిరుతల కళాకారులు ప్రపంచ రికార్డు ప్రదర్శనలో పాల్గొనడం గర్వకారణం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది కళాకారులు పాల్గొనే ప్రదర్శనలో మన మన్నెంపల్లి కళాకారులు గ్రామ కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చెన్న కేశవ కళాకారుల సంఘం అధ్యక్షుడు శంకరయ్య,రావుల మల్లేశం, సంఘం సభ్యులు దుర్గం జంపయ్య,పల్లి తిరుపతి, కామెరా కనకయ్య, రాజ్ కుమార్, పార్నంది మల్లేశ్, పార్నంది రాజయ్య,దుర్గం శ్రీనివాస్, తాళ్లపల్లి ఎల్లయ్య, తల్లపెల్లి భూమలింగం, బీనపల్లీ బాలయ్య, బీనపల్లి రాజయ్య, అసోద అంజయ్య, ఎడ్ల తిరుపతి రెడ్డి, పోతుగంటి సంపత్, కొలకాని మల్లేశం, సుదగొని శ్రావణ్, బూడిద కిషోర్, పార్నంది సంపత్,కామెర సంపత్, గుంటి రాములు,బీనపల్లి మొండయ్య, నాంపల్లి చంద్రమౌళి, సుదగొని వేణు, సానగొండ సది,దరిపల్లి వేణుమార్, సుదగొని సదయ్య పాల్గొన్నారు.

## హుజూరాబాద్ టౌన్ సీఐగా కరుణాకర్ బాధ్యతల స్వీకరణ

హుజూరాబాద్ టౌన్, మే 8: హుజూరాబాద్ టౌన్ నూతన సీఐగా కరుణాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. టౌన్ సీఐగా వ్యవహరించిన గుర్రం తిరుమల్ గౌడ్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లగా, హైదరాబాద్ సీఐడీలో విధులు నిర్వర్తిస్తున్న కరుణాకర్ హుజూరాబాద్ ఎస్‌హెచ్‌వో బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శాం తి భద్రతల పరిరక్షణకు రాజీలేకుండా కృషిచేస్తానని తెలిపారు. ఫిర్యాదుదారులు నేరుగా తమకే ఫిర్యాదులు చేయాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. సీఐ కరుణాకర్‌కి పోలీస్ సిబ్బంది స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 8: నగరంలో ఇంటర్ లింకింగ్ లైన్స్, డీటీఆర్, లైన్ మెయింటనెన్స్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎం లావణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఆర్టీసీ వర్క్ షాప్, విజయ దుర్గకాలనీ, హిందూపురి కాలనీ, ఎస్సారార్ కాలేజీ ఏరియా, విద్యానగర్, ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు కిశోర్ ఆటో స్టోర్ ఏరియా, ఒడిస్సా స్కూల్, మెయిన్ రోడ్ కమాన్ ఏరియా, సీపీఐ ఆఫీసు, విశాల్ మార్ట్, కపిల్ చిట్ ఫండ్ కార్యాలయం వెనక ఏరియా, ఉదయం 8 నుచి 10 గంటల వరకు పద్మశాలీ వీధి, షాషామహల్, పాత బజార్, తెలంగాణ చౌక్, రాఘవేంద్ర నగర్, లక్ష్మీనగర్, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డు రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## డీఆర్డీఏ టీంను అభినందించిన కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్, మే 8 : 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్‌హెచ్‌సీ బ్యాంకు లింకేజీలో కరీంనగర్ జిల్లా, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికి గాను రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా డీఆర్డీఏ టీంను అభినందించారు. గతేడాది 771 కోట్ల లక్ష్యానికి గాను 787 కోట్ల రుణాలు ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు ఇప్పించి కరీంనగర్ జిల్లా 102 శాతం ప్రగతి సాధించింది. 2025–26లో కూడా ఇదే విధంగా లక్ష్యాలను సాధించాలని సూచించారు.

## మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం

చొప్పదండి,మే8 : రాష్ట్ర మన్నురుకాపు సంఘం ఆదేశాల మేరకు చొప్పదండి నియోజకవర్గ కాపు సంఘం ఇన్‌చార్జిలు మడ్లపెల్లి శ్రీనివాస్, పుల్కం గంగన్న, కోల ప్రభాకర్,తౌట కృష్ణ, గాండ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం చొప్పదండి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు మల్యాల మహేందర్, ఉపాధ్యక్షుడు మునిగాల తిరుపతి, కొత్త హన్మండ్లు, ప్రధాన కార్యాదర్శిగా అమిరిశెట్టి వెంటేశ్, సంయుక్త కార్యదర్శులు పబ్బ శ్రీనివాస్, పెరుక శ్రీనివాస్, కోశాధికారి చుప్ప శ్రీనివాస్ సభ్యులు ఉప్పు కర్ణాకర్,కటుకం లచ్చయ్య,గాండ్ల విజయ్,జిల్లాల విజయ్,బచ్చు నర్సయ్య, సభ్యులు ఉప్పు కర్ణాకర్,కటుకం లచ్చయ్య,గాండ్ల విజయ్,జిల్లాల విజయ్,బచ్చ నర్సయ్య లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాపు సంఘం గౌరవ అధ్యక్షులు కనుకం జక్కన్న ,పెంచాల అంజయ్య, తోట కోటేశ్, కోట్టె అరాజ్, మునిగాల రాజేందర్, మంగ శారపు మల్లారెడ్డి పలు గ్రామాల మున్నురుకాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

### నిరుద్యోగులకు మూడు నెలల శిక్షణ

కమాన్‌చౌరస్తా, మే 8 : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మూడు నెలల శిక్షణ ల్యాండ్ సర్వే, కన్‌స్ట్రక్షన్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జీ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఇందుకు 18 ఏండ్ల నుంచి 35 ఏండ్ల వయస్సు కలిగి, పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు న్యాక్ ట్రైనింగ్ సెంటర్, సవరన్ స్ట్రీట్ కరీంనగర్‌లో సంప్రదించాలన్నారు.

### నేటి నుంచి క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

కమాన్‌చౌరస్తా, మే 8 : జిల్లా కేంద్రంలోని మే 9, 10, 11 తేదీల లో సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో సెయింట్ మార్కు చర్చి గ్రౌండ్‌లో క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రెస్బిటేట్ చైర్మన్ రాములు ఇమ్మానుయేల్, అధ్యక్ష మండల కోశాధికారి డాక్టర్ ఎస్ జాన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డి, కరపత్రం విడుదల చేశారు. మా నవత విలువలతో కూడిన ఫలభరితమైన జీవితం జీవించేందుకు, స మాజంలో మార్పు కోసం ఈ ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మే 8 : భూభారతి రెవెన్యూ చట్టం 2025ని అమలు చేసే క్రమంలో సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఔత్సాహిక లైసెన్సుడు సర్వేయర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈనెల 17వరకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని, ఎంపికైన వారికి ఈనెల 26 నుంచి జూలై 25 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి సాయంతో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు శిక్షణ ఇవ్వనున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

### రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సనత్

శంకరపట్నం, మే 8 : వీసీకే విముక్త చిరుతల పార్టీ యువజన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన పెందోట సనత్ ఎంపికయ్యారు. ఈ మేరకు.. గురువారం వీసీకే విముక్త చిరుతల పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జీలుకర శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి క్రుషి చేసిన రాష్ట్ర యూత్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, తదితరులకు సనత్ క్రుతజ్ఞతలు తెలిపారు.

### పుస్తె, మట్టెల అందజేత

గన్నేరువరం, మే 8 : మండలంలోని గునుకుల కొండాపూర్ పరిధిలోని చొక్కలపల్లిలో కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పాడి రైతు చుక్కల సంపత్ మంజుల కుమార్తె కీర్తి వివాహానికి పుస్తె, మాట్టెలను అందజేశారు. గ్రామ డైరీ చైర్మన్ శ్రీనివాస్, డైరీ సూపర్వైజర్ ధనుర్బాన్, డైరీ సెక్రటరీ నాలపట్ల శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

### 15 నుంచి బీఎస్సీ ఆనర్స్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మే 8 : శాతావాహన విశ్వవిద్యాలయం పరిధిలో బీఎస్సీ ఆనర్స్ (4 సంవత్సరాల కోర్స్ )లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 15 నుంచి ప్రారంభమై మే 30కి ముగుస్తాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డీ సురేశ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఆనర్స్‌లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు కంప్యూటర్ సైన్స్‌లో, రెండో సెమిస్టర్ బయోమెడికల్ సైన్స్‌లో జరుగుతాయని చెప్పారు. ఇతర వివరాలకు సంబంధిత కళాశాలలో గాని, విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.



చిరుతల భజన ప్రదర్శిస్తున్న కళాకారులు

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిరుతల భజన

- 600 మంది కళాకారులు.. 29 గ్రూపులు.. 8 గంటలు నిర్విఘ్నంగా ప్రదర్శన
- ఉమ్మడి పది జిల్లాల కళాకారులు హాజరు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 8 : రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 600 మంది కళాకారులు, 29 గ్రూపులు.. 8 గంటల నిర్విరామ ప్రదర్శనతో చిరుతల భజన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కరీంనగర్ అకాడమీ, కళారవల్లి సోషియో కల్చరల్ అసోసియేషన్, సల్వాజి ఈవెంట్స్ కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కళాభారతిలో ప్రపంచ రికార్డ్ కోసం చిరుతల భజన ప్రదర్శించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. అధికారులు రికార్డు చిహ్నాన్ని నిర్వాహకులకు అందజేశారు. అనంతరం 29 గ్రూపుల కళాకారులకు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ సువార్త, ఆర్డీవో కే మహేశ్, టీ అనిల్‌రాజు, గోదావరిఖని కళా సంఘాల సమైక్య అధ్యక్షుడు కే రమణయ్య, ఫోక్ ఆర్ట్స్ అకాడమీ కోఆర్డినేటర్ జ్ఞాన ప్రకాశ్, సల్వాజి ప్రవీణ్, విష్ణు దాస్, గోపాలరావు. కపాదానం, మురళి, మధు, గాయని సంధ్య పాల్గొన్నారు.

## నా వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా

**ప్రకటన విడుదల చేసిన ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత**

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 8 : తాను సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు అనేక విధాలుగా వైరల్ కావడం బాధాకరమని, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని శాతవాహన యూనివర్శిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను వృత్తి రీత్యా ఒక ప్రొఫెసర్ అని, సామాజిక బాధ్యతతో నేటికీ అనేక సామాజిక కార్యక్రమాలు సొంతంగా చేపడుతున్నట్లు చెప్పారు. ఒక పరిశోధకురాలిగా యుద్ధం అంటే భయంతో, అందులో మరణించే పసిపిల్లలు గుర్తుకు వచ్చి పోస్ట్ చేశాను, తప్పు.. దేశ భద్రత, సైన్యం, ప్రభుత్వంపై ఎటువంటి అగౌరవంతో కాదని స్పష్టం చేశారు. తాను బాధ్యత కలిగిన పౌరురాలినని, దేశం అంటే భక్తి ఉంది కాబట్టే తాను స్పందించానని, తన వ్యాఖ్యలు ఎవరినీ, ఏ మతాన్నీ, ఏ సందర్భాన్నీ కించపరిచేవి కావని చెప్పారు. ఎవరైనా బాధపడినా, మనోభావాలు దెబ్బతిన్నా క్షమించాలని కోరారు.

## అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టిన కారు

**ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి గాయాలు**

మానకొండూర్, మే 8 : మండలంలోని అన్నారం శివారు రాఘవాపూర్ రహదారిపై ఓ కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు.. 108 సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కోండ్ర సంజీవ్ హైదారాబాద్‌లోని డీఆర్డీవోలో విధులు నిర్వర్తిస్తున్నాడు. సంజీవ్ సమీప బంధువు మంచిర్యాలకు చెందిన దాసారం నర్సయ్యతో కలిసి గురువారం కారులో పచ్చునూర్ వెళ్లి తిరిగి మానకొండూర్ వస్తున్నారు. ఈ క్రమంలో రాఘవాపూర్ శివారులో ప్రమాదవశాత్తు కారు టైర్ పగిలి పోవడంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సంజీవ్‌కు తలకు గాయాలు కాగా, అందులో ఉన్న నర్సయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన సంజీవ్‌ను చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్, మే 8 : నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. గురువారం శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతిగదుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి, మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, మండల విద్యాధికారి ఎం మధుసూదనాచారి, ప్రిన్సిపాల్ స్వప్న, ఏఎంసీ చైర్మన్ ఓదేలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, నాయకులు నందగిరి రవి, కే సురేశ్, మడుపు ప్రేమ్‌కుమార్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం**

మానకొండూర్/తిమ్మాపూర్ మే 8 : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆనారోగ్య సమస్యలతో బాధపడుతూ, వివిధ దవాఖానల్లో చికిత్స పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఖర్చుల కోసం మంజూరు చేసిన చెక్కులను గురువారం ఎమ్మెల్యే కవ్వంపల్లికి అందజేశారు. మానకొండూర్ మండలానికి చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ. 15.63 లక్షల విలువైన చెక్కులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, తిమ్మాపూర్ మండలానికి చెందిన 54 మంది లబ్ధిదారులకు రూ. 14.91 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆయా చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో మానకొండూర్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో వరలక్ష్మి, అర్ఐ ప్రీతి, పార్టీ మండలాధ్యక్షుడు నందగిరి రవి, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదేలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు గోపు మల్లారెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, కుంట రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నాగులమల్యాలలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు

కొత్తపల్లి, మే 8 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గల వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ వారి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నాగులమల్యాల గ్రామంలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు, వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు యూరియా తక్కువగా వాడడం, అవసరం మేరకు రసాయనాల వినియోగం, నేలను కాపాడుకోవడం వంటి అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని పలు గ్రామాల్లో జరిగే రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు ఉషారాణి, విజయభాస్కర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తు గడువు పెంపు

కొత్తపల్లి, మే 08 : కరీంనగర్ నగరపాలక సంస్థ, జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల గడువును ఈనెల 11 వరకు పొడిగించినట్లు డీవైఎస్‌వో వీ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యే ఉచిత శిక్షణలకు దరఖాస్తుల గడువు ఈనెల 9 వరకు ఉందన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థుల అభ్యర్థన మేరకు గడువును పొడిగించినట్లు ఆయన చెప్పారు.

### డ్రోన్ వినియోగ శిక్షణకు కిట్స్ ఎంపిక

హుజూరాబాద్ రూరల్, మార్చి 8 : గ్రామీణ యువతకు డ్రోన్ ఉపయోగం మీద శిక్షణ ఇచ్చేందుకు సింగాపూర్ కిట్స్ కళాశాల ఏరోవిజన్ డ్రోన్ ల్యాబ్ వారితో (మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్ ) అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సతీష్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ గ్రామీణ యువతకు డ్రోన్ నిర్వహణకు శిక్షణ ఇచ్చేందుకు ఏఐసీటీఈ దేశం మొత్తం నుంచి 31 కళాశాలలను ఎంపిక చేశారని, అందులో సింగాపూర్ కిట్స్ ఒకటని వివరించారు. ఈ ఆధునిక కాలంలో వ్యవసాయంతో పాటు తదితర పనులను డ్రోన్ ద్వారా సులభంగా చేస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం యువతకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులను కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మి కాంతారావు అభినందనలు తెలిపారు.

### లక్నోలో రెండు రోజుల జాతీయ సదస్సు

విద్యానగర్, మే 8: లక్నోలోని ఎన్‌బీఎస్‌సీ లో షేర్ సర్వీసెస్ ఎంటిటీ, సహకార సంస్థలో సహకారంపై రెండు రోజుల జాతీయ సదస్సును నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు గురువారం అధికారికంగా ప్రారంభించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా, సహకార సంస్థల బలోపేతం కోసం నాబార్డ్ రెండు రోజుల సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సహకార బ్యాంకుల బలోపేతం కోసం అమిత్ షా నాయకత్వంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తీసుకున్న వివిధ లాభాలు, నష్టాలను చర్చించడానికి, తగిన చర్యలు తీసుకోవడానికి తీసుకున్న చొరవలను రవీందర్ రావు స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు దీర్ఘకాలంలో చిన్న సహకార బ్యాంకులకు ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్ కుమార్ బుటానీ, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఆర్ సిఎస్ సౌరభ్ బాబు, నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీ, నాబార్డ్ డీఎండీ గోవర్ధన్ రావత్, సహకార రంగంలోని ఐటి, ఇతర విభాగాలను చూసుకునే పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ప్రొఫెసర్ సుజాతపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ విద్యానగర్/ జగిత్యాల మే 8: దేశాన్ని, సైనికుల సాహసాన్ని కించపరుస్తూ ఆపరేషన్ సిందూర్‌ను ఎగతాళి చేసే విధంగా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆమెపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కరీంనగర్, జగిత్యాల పోలీసులకు బీజేపీ, భారత సురక్ష సమితి నాయకులు గురువారం ఫిర్యాదులు చేశారు. కరీంనగర్‌లో బీజేపీ శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. భారత సైన్యం అత్యంత సాహసోపేతంగా ఆపరేషన్ సిందూర్ పేరిట దాయాది దేశంలోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేస్తే దానిని తప్పుబట్టేవిధంగా ప్రొఫెసర్ సుజాత వ్యవహరించడం దుర్మార్గమని, ఇది ముమ్మాటికి దేశద్రోహమేనన్నారు. జగిత్యాలలో భారత సురక్ష సమితి నాయకులు టౌన్ సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు.

తెలంగాణచౌక్, మే 8 : కేంద్ర ప్రభుత్వం సింధూర్ పేరుతో ఉగ్రవాదులపై చేసిన సైనికచర్యను కించపరిచేలా సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టిన శాతావాహన ప్రొఫెసర్ సూరపల్లి సుజాతపై శాతవాహన విశ్వవిద్యాలయం అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సం ఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ గురువారం ఒక ప్రకటలో డిమాండ్ చేశారు. సుజాత ప్రొఫెసర్ పదవికి అనర్హురాలన్నారు.

### సూరేపల్లి సుజాత దిష్టి బొమ్మ దహనం

విద్యానగర్, మే 8 : ఆపరేషన్ సింధూర్‌పై దేశాన్ని కించపరిచేలా, సైనికుల సాహసాన్ని ఎగతాళి చేసేలా ఎఫ్‌బీలో పోస్ట్ చేసిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్, రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యురాలు సూరేపల్లి సుజాతపై కేసు నమోదు చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ వద్ద నిరసన చేపట్టి, ప్రొఫెసర్ సుజాత దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వైస్ చాన్సలర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాపర్తి విజయ దేశ శిల్ప, వంగల శ్రీదేవి, బండారి గాయత్రి, నాగసముద్రం ప్రవీణ్, జాడి బాల్రెడ్డి, ప్రేమలత, చంద్రకళ, సునీత, మామిడి చైతన్య, మాలతి, కొలుగూరి భార తి, ధనలక్ష్మి, సంపత్, ఉప్పరపల్లి శ్రీను బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

### డిపో-2ను సదర్శించిన ఈడీ

తెలంగాణచౌక్, మే 8 : జిల్లాకేంద్రంలోని బస్టాండ్ అవరణలో గల డిపో–2ను కరీంనగర్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమన్ ఆర్ఎం రాజుతో గురువారం సదర్శించారు. డిపో–2లో ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించిన ఏర్పాటు పరిశీలించారు. మౌలిక వసతులు, చార్జింగ్ పాయింట్లు, వాహనాల పని తీరును ఎలక్ట్రిక్ బస్సుల నడిపిస్తున్న ప్రైవేట్ అపరేటర్ జేబీఆర్ మారుతి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వసతుల కోసం సూచనలిచ్చారు. అనంతరం బస్టాండ్‌లో ప్రయాణికుల ఏర్పాటు చేసి, సౌకార్యలను పరిశీలించారు. వేసవి కాలం ఎండ త్రీవత దృష్ట్యా తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఆర్ఎం భూపతిరెడ్డి, వెంకట్వేర్‌రావు, డీఎం శ్రీనివాస్, ఏటీఎం సురేశ్ ఉన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణచౌక్,మే 8 : ఈ నెల 20న నిర్వహించనున్న దేశ వ్యాప్తం సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపు నిచ్చారు. నగరంలోని టవర్ సర్కిల్‌లో తెలంగాణ బిల్డింగ్ అండ్ అథర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ కోశాధికారి జగదీశ్‌తో కలిసి గురువారం సమ్మె సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక సంఘులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

### జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మే 8 : జిల్లా కేంద్రంలో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర కార్యదర్శికూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి చాడవెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం సింధూర్ పేరుతో చేపట్టిన మిలటరీ అపరేషన్ పార్టీ సంపూర్ణ మద్దుతు ఇస్తుందన్నారు. కాని, కాశ్మీర్‌కు ఇరుదేశాలు శాంతి చర్చలతో శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. ఉగ్రవాదాం ఏ రూపంలో ఉన్న అణిచివేయాల్సిందేన్నారు. పార్టీ జిల్లా మహాసభలో భవిష్యత్ ప్రణాళికలు, పార్టీ కార్యక్రమాలపై చర్చించి నిర్ణయాలను తీసుకుంటామని తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజు మల్లవ్వ, నాయకులు అంజలీ, రమేశ్ ఉన్నారు.

### పిడుగుపాటుకు గేదె మృతి

చిగురుమామిడి, మే 8 : మండలంలోని చిన్న ములకనూరు గ్రామంలో పైడిపల్లి లక్ష్మికి చెందిన గేదె గురువారం ఉదయం అకాల వర్షానికి పిడుగు పడి మృతి చెందింది. సుమారు దీని విలువ రూ. 80వేల వరకు ఉంటుందని లక్ష్మి కన్నీరు మునీరుగా విలపిస్తూ తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని ఆమె కోరారు.

### ఈవీఎం గోదాం తనిఖీ

కలెక్టరేట్, మే 8 : కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో గల ఎలక్ట్రానిక్ వోటింగ్ మిషన్ల గోదాం గురువారం డీఆర్వో బీ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ల సంబంధిత యంత్రాలు పరిశీలిస్తూ, సమగ్ర నివేదికను పంపుతున్నట్లు తెలిపారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. భద్రతకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వర్తిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు సత్తినేని శ్రీనివాస్, శ్రీనివాస్, మడుపు మోహన్, సయ్యద్ బర్కతలీ, అంజయ్య పాల్గొన్నారు.

### సార్వత్రిక సమ్మెకు టీకేవీఎస్ మద్దతు

కలెక్టరేట్, మే 8 : ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెకు తెలంగాణ కిసాన్ వికాస్ సంఘ్ జిల్లా శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం ఉత్తర తెలంగాణ కన్వీనర్ జాల మహేందర్ గురువారం జిల్లా కేంద్రంలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దు కోసం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో వ్యవసాయ కూలీలు, రైతాంగం కూడా పాల్గొనబోతున్నారని స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు అన్నదాతకిచ్చిన హామీలు సత్వరమే అమలు చేయా లని, సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, యాసంగి రైతు భరోసా విడుదల చేయాలని, ప్రధాన పంటలన్నిటికీ బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వడగళ్లతో నష్టపోయిన రైతాంగానికి సత్వరమే పరిహారం అందజేయాలని కోరారు. లేకుంటే టీకేవీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.